కోళ్ల ఫారంలో వైద్య బృందం తనిఖీలు



కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న వైద్య బృందం, అధికారులు

పరవాడ: గ్రామ సమీపంలోని ఓ కోళ్ల ఫారంలో మృతి చెందిన కోళ్లతో వ్యాపించిన దుర్వాసనపై ఆందోళన చెందిన స్థానికులు అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన అధికారులు సంబంధిత కోళ్ల ఫారాన్ని సందర్శించారు. కోళ్ల ఫారంలో వీధి కుక్కలు చొరబడి సుమారు 250 కోడి పిల్లల్ని చంపేశాయి. వీటిని కోళ్ల ఫారం యజమానికి చూపించేందుకు సిబ్బంది మూటలు కట్టి ఓ గదిలో భద్రపరిచారు. వాటి నుంచి దుర్వాసన రావడంతో సమీప నివాసులు అధికారులకు సమాచారం అందించారు. ఎంపీడీవో వి.ధర్మారావు, పశువైద్య శాఖ ఏడీ రామకృష్ణకీర్తి, పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి జయశ్రీ కరిష్మా, పరవాడ పంచాయతీ కార్యదర్శి మురళీపట్నాయక్ ఘటన స్థలికి చేరుకుని మృతి చెందిన కోళ్లను గోతిలో పూడ్చించి, మందులు పిచికారీ చేయించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

శాస్త్రీయ పరిశోధనల్లో మేటి.. సీతాలక్ష్మి

- జాతీయ స్థాయిలో గుర్తింపునిచ్చిన తమలపాకులపై పరిశోధన
- క్యాన్సర్‌కు దివ్యౌషధంగా తమలపాకు
- వృత్తి, పరిశోధనల్లో రాణిస్తున్న డాక్టర్ బి.సీతాలక్ష్మి
- 15 పరిశోధనా పత్రాలు, రీసెర్చ్ గైడ్‌గా ముగ్గురికి డాక్టరేట్‌లు

సబ్బవరం: వృత్తి జీవితంలో విద్యార్థుల ఉత్తమ భవితకు మార్గనిర్దేశం చేయడంతోపాటు, పరిశోధనల్లో రాణిస్తూ సమాజానికి తన వంతు శాస్త్రీయ సహకారం అందిస్తున్నారు సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి. ఆహార పదార్థాలలో ఎన్నో ఔషధ గుణాలు దాగి ఉన్నాయని, శాస్త్రీయ పరిశోధనల ద్వారా వాటి ప్రాముఖ్యాన్ని నిరూపించి, చూపారు. ముఖ్యంగా పూజలకు, తాంబూల సేవనానికి వినియోగించే తమలపాకు క్యాన్సర్ నివారణకు సమర్థవంతంగా పని చేస్తుందని తన పరిశోధనల ద్వారా నిర్ధారించారు. ఈ పరిశోధనలకు గుర్తింపుగా రెండు జాతీయ స్థాయి పేటెంట్ హక్కులతో పాటు 15 పరిశోధనాపత్రాలను సమర్పించడం విశేషం. పసుపు, లవంగాలు, దాల్చిన చెక్క వంటి సుగంధ ద్రవ్యాలతో పాటు తులసి వంటివి ఆహార పదార్థాలను నిల్వ చేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయని డాక్టర్ సీతాలక్ష్మి శాస్త్రీయంగా నిరూపించారు.



సీతాలక్ష్మికి దక్కిన ఇంటిలెక్చువల్ ప్రోపర్టీ సర్టిఫికెట్

రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా..

గుంటూరులో ప్రాథమిక విద్య, ఒంగోలులో కళాశాల విద్యను పూర్తి చేసిన డాక్టర్ సీతాలక్ష్మి, ఏయూ నుంచి ఎంఎస్సీ, డాక్టరేట్ పట్టాలు పొందారు. ప్రకాశం జిల్లా కందుకూరు డిగ్రీ కళాశాలలో బోటనీ అధ్యాపకురాలిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆమె, ఆ తర్వాత చోడవరం, విశాఖలోని కృష్ణా కళాశాల, శ్రీకాకుళం వుమెన్స్ కళాశాలలో సేవలందించారు. 2021 నుంచి సబ్బవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశాఖ కృష్ణా కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న సమయంలోనే రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారం పొందారు.



17 ఏళ్లుగా పరిశోధనలు

2008లో ప్రారంభమైన ఆమె పరిశోధన నేటికీ అవిరామంగా కొనసాగుతోంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం రీసెర్చ్ గైడ్‌గా కూడా వ్యవహరిస్తున్న డాక్టర్ సీతాలక్ష్మి మార్గదర్శకత్వంలో ఇప్పటికే ముగ్గురు డాక్టరేట్ డిగ్రీలు పొందడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ప్రస్తుతం నలుగురు రీసెర్చ్ స్కాలర్లు ఆమె పర్యవేక్షణలో విజ్ఞానాన్వేషణ చేస్తున్నారు.

తమలపాకులపై పరిశోధనకు గుర్తింపు

తమలపాకులలోని క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే బాష్పశీల తైలంపై ఆమె చేసిన కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. తమలపాకు శిలీంద్ర నాశనిగా, బాక్టీరియా సంబంధిత వ్యాధులకు బయోపెస్టిసైడ్‌గా పనిచేస్తుందని ఆమె పరిశోధనలో తేలింది. ముఖ్యంగా శీతలీకరణ యంత్రాలు అందుబాటులో లేని పరిస్థితులలో తమలపాకుల నుంచి తయారుచేసిన మందును ఆహార పదార్థాల నిల్వకు తక్కువ ఖర్చుతో ఉపయోగించవచ్చని ఆమె తెలియజేశారు. తుని ప్రాంతంలో లభించే తమలపాకులలో బాష్పశీల తైలం, ప్రత్యేక రసాయనిక పదార్థాలు అధికంగా ఉంటాయని గుర్తించారు. ఈ తైలంతో తయారు చేసిన ఔషధం క్యాన్సర్ వ్యాధిని నయం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుందని, ఎటువంటి దుష్ప్రభావాలు లేని దివ్య ఔషధంగా ఉపయోగపడుతుందని వెల్లడించారు. పలు ఫార్మా సంస్థలు ఆమె పరిశోధనలపై ఆసక్తి చూపాయి. ప్రస్తుతం క్యాన్సర్ ఔషధం అభివృద్ధిపై చర్చలు జరుగుతున్నాయి. సీతాలక్ష్మి భర్త డాక్టర్ ఎస్.వి.కుమార్ ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేశారు. 34 ఏళ్ల పాటు వైద్య వృత్తిలో వివిధ హోదాల్లో సేవలందించారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

- పరవాడ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీలో ఎస్పీ తుహిన్ సిన్హా



పరవాడ పోలీస్ స్టేషన్‌లో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

పరవాడ: గంజాయి అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసులను ఆదేశించారు. పరవాడ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వినియోగదారుల వివరాలను సేకరించి, వారిపై నిఘా ఉంచాలన్నారు. రౌడీ షీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులను కౌన్సిలింగ్ చేయడంతో పాటు వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. నేరాల నియంత్రణకు గస్తీ చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైం, రోడ్డు భద్రతలపై స్థానిక పోలీసులు, మహిళా పోలీసులతో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగతిని ఆరా తీశారు. స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐలు కృష్ణారావు, మహాలక్ష్మిలు ఉన్నారు.

డంపింగ్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న రాంకీ ఫైర్ సిబ్బంది

పరవాడ: మండల కాంప్లెక్సు సమీపంలోని డంపింగ్ యార్డ్‌లో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో డంపింగ్ యార్డ్‌లో గుట్టలుగా పడివున్న చెత్తాచెదారం ఆహుతయింది. డంపింగ్ యార్డ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి పారేసిన సిగరెట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న పరవాడ ఎంపీడీవో వి.ధర్మారావు, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్ ఘటనా స్థలికి చేరుకుని, ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. రాంకీ అగ్నిమాపక కేంద్రం నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.



ఉద్యమాలతోనే మహిళలకు సమాన హక్కులు

పరవాడ: ఉద్యమాల ద్వారానే మహిళలకు సమాన హక్కులు సాధ్యమని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పరవాడ టిడ్కో కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమాజంలో సగ భాగం మహిళలు ఉన్నప్పటికీ సమాన హక్కులు పొందలేకపోతున్నారన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం మాట్లాడుతూ మహిళలకు రక్షణ కరువై, హింసలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో విద్యుత్, రేషన్ డిపో సమస్యలను పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరారు. కార్యక్రమంలో ఎం.బంగారమ్మ, డి.లక్ష్మి, అన్నపూర్ణ, ఇందుమతి, అరుణ, సంతోషి, రాణి, హైమ, అబద్దం, సీతామహలక్ష్మి, సూరమ్మ, బృంద, మంగ, సీతమ్మ పాల్గొన్నారు.

మహిళా పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని మహిళా పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు చీరలు అందించారు. చినముషిడివాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మొత్తం 35 మందికి చీరలు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, టీడీపీ నేత శానాపతి శంకర్రావు, డ్వాక్రా ఆర్పీలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పెందుర్తి: ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అమృత ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. హెల్మెట్, కారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అన్నారు. పూర్తిస్థాయిలో అవగాహన లేని తల్లిదండ్రులకు పిల్లలు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగించాలని సూచించారు. పెందుర్తి ట్రాఫిక్ విభాగం ఎస్ఐ నరసింగరాజు, ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో రవి అగర్వాల్ దంపతులు



కప్పస్తంభం వద్ద అగర్వాల్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ చైర్మన్ రవి అగర్వాల్ ఆయన సతీమణి మిథాలీ మధుస్మిత(ఆంధ్రా, తెలంగాణ ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్) దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, వేద ఆశీర్వచనమిచ్చారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ అందజేశారు.

ఘనంగా తిరువీధి ఉత్సవం



విగ్రహాలు, కలశాల ఊరేగింపు

సబ్బవరం: మండల కేంద్రంలో పునర్నిర్మించిన రామలింగేశ్వర, ఉమాదేవి, లక్ష్మీగణపతి, నందీశ్వర, చండేశ్వర శిలా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా విగ్రహాలు, పసిడి కలశాలకు శుక్రవారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, రక్షా సూత్రధారణ, దీక్షాధారణ, అగ్నిమధనం, అగ్ని ప్రతిష్ఠాపన, అంకురార్పణ, దేవతాహ్వానం తదితర పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాష్, గెద్దం కృష్ణ, బర్ల రమణ, కొల్లి కృష్ణ, గంగు నాయుడు, దనిమిరెడ్డి శ్రీను, గెద్దం రమేష్, అయ్యప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ అసిరితాత

పెందుర్తి: పాఠశాలలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అసిరితాత సూచించారు. బాలికలను, మహిళలను వేధిస్తే పోక్సో, ఇతర కఠిన చట్టాలతో జైలు పాలవుతారని హెచ్చరించారు. స్థానిక మహాత్మా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలకు, ఆడపిల్లలకు రక్షణగా ఉన్న చట్టాలపై అవగాహన కలిగించారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కళాశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంపై వక్తృత్వ పోటీలు

పరవాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గొర్లివానిపాలెం సాయి విద్యా నికేతన్ పాఠశాలలో శుక్రవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆదేశాల మేరకు ఎస్ఐ మహాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు ఎస్ఐ మహాలక్ష్మి బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రంగారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎంపీ భరత్‌కు అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: విశాఖ ఎంపీ భరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులను సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. దేవస్థానం ఇన్‌చార్జిగా ఈవోగా మూడు నెలలపాటు సుబ్బారావును దేవదాయశాఖ నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి వీరిని కలిశారు. ఆయన వెంట దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ ఉన్నారు.

జన్ ఔషధి కేంద్రాలతో చౌక ధరలకే మందులు

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్



దీపాంజలినగర్ జన్ ఔషధిలో ఎంపీ సీఎం రమేష్

పరవాడ: దేశవ్యాప్తంగా లక్షలాది ప్రజల ఆరోగ్య ఖర్చులను తగ్గించడంలో జన్ ఔషధీకేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అనకాపల్లి ఎంపీ సీ.ఎం.రమేష్ అన్నారు. జనరిక్ మందుల వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ పిలుపు మేరకు మార్చి 7న జన్ ఔషధీ దివస్‌ను ఘనంగా నిర్వహిస్తున్న తరుణంలో దీపాంజలినగర్ జనరిక్ మెడికల్ షాపును శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 15 వేలకు పైగా జనరిక్ ఔషధి కేంద్రాలున్నాయని, వాటిలో రెండు వేల రకాల మందులు, 300 శస్త్ర చికిత్స ఉత్పత్తులను తక్కువ ధరలకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మరిన్ని ఔషధీ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎరమేశ్వరరావు, టీడీపీ నాయకులు బండారు అప్పలనాయుడు పాల్గొన్నారు.